www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 ఏప్రిల్ 2024
8 పేజీలు

ఏలూరు ▪ పశ్చిమ గోదావరి



నామినేషన్ దాఖలు చేస్తున్న కారుమూరి



నామినేషన్ దాఖలు చేసిన పితాని సత్యనారాయణ

రెండో రోజు 29 నామినేషన్లు

- 'పశ్చిమ'లో 21, ఏలూరులో 8 నామినేషన్లు దాఖలు
- ప్రధాన పార్టీల అభ్యర్థులే ఎక్కువ
- ఉండిలో రఘురామకృష్ణంరాజు తరపున కుటుంబీకుల నామినేషన్
- రెండు రోజుల్లో మొత్తం 37 నామినేషన్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నామినేషన్ల పర్వం ముమ్మరంగా కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఏలూరు జిల్లాలో ఏలూరు ఎంపీ స్థానానికి రెండు నామినేషన్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరు నామినేషన్లు వచ్చాయి. ఏలూరు ఎంపీ స్థానానికి కాంగ్రెస్ తరపున కావూరి లావణ్య, మరో ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ వేశారు. దెందులూరు నియోజకవర్గంలో వైసిపి నుంచి అబ్బాయిచౌదరి, నూజివీడులో వైసిపి అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కైకలూరు స్థానానికి కాంగ్రెస్ నుంచి బొడ్డు నోబుల్‌తోపాటు జైబీమ్ పార్టీ నుంచి, ఇతరులు నామినేషన్లు దాఖలు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం మొత్తం 21 నామినేషన్లు వచ్చాయి. ఆచంటలో వైసిపి నుంచి చెరుకువాడ రంగనాథరాజు, టిడిపి నుంచి పితాని సత్యనారాయణ, పాలకొల్లులో టిడిపి నుంచి నిమ్మల రామానాయుడు, నరసాపురంలో వైసిపి నుంచి ప్రసాద్‌రాజు, భీమవరంలో వైసిపి తరపున గ్రంధి శ్రీనివాస్, ఉండిలో వైసిపి నుంచి పివిఎల్.నరసింహరాజు, తణుకులో వైసిపి నుంచి కారుమూరి నాగేశ్వరరావు, టిడిపి నుంచి ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెంలో జనసేన నుంచి ..6లో

నామినేషన్ దాఖలు చేస్తున్న ఉమాబాల



నామినేషన్ దాఖలు చేస్తున్న లావణ్య

అధికారుల ఉదాశీనత..!

- నామినేషన్ల సందర్భంగా కోడ్ ఉల్లంఘనలు
- రిట్నరింగ్, పోలీస్ అధికారుల తీరుపై చర్చ
- వంద మీటర్ల నిబంధనలకు తిలోదకాలు
- ఏలూరులో వైసిపి అభ్యర్థి నామినేషన్‌లో నిబంధనలకు తూట్లు
- అధికార పార్టీకి ఒకలా.. ప్రతిపక్షాలకు మరోలా అంటూ విమర్శలు

నామినేషన్ దాఖలు చేసే తహాశీల్దార్ కార్యాలయం వద్ద గుమిగూడిన ఆళ్ల నాని అనుచరగణం (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ప్రక్రియలో కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీ నాయకులకు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నవారి పట్ల మరోలా అధికారుల వ్యవహార శైలి ఉంటుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ నెల 18వ తేదీ గురువారం ఏలూరు వైసిపి అభ్యర్థి ఆళ్ల నాని నామినేషన్ సందర్భంగా జరిగిన పరిణామాలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. వంద మీటర్ల పరిధిలోకి మూడు వాహనాలకే అనుమతి ఉంటుంది. అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే నామినేషన్ వేసేందుకు వెళ్లడానికి అవకాశం ఉంది. ఏలూరు నియోజకవర్గానికి సంబంధించి కోటదిబ్బపై ఉన్న తహాశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. తహాశీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల వద్ద అధికారులు లోపలికి ఎవరినీ వెళ్లకుండా బారికేడ్లు వేశారు. ఆళ్ల నాని నామినేషన్‌కు వచ్చేసరికి మాత్రం పోలీసులు పూర్తిగా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేశారు. కార్లతోపాటు జనం పెద్దఎత్తున ..6లో

పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హులే

నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గౌరవ్ మధుకర్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హులవుతారని, ఎన్నికల వ్యయంపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మేశ్రం గౌరవ్ మధుకర్ (ఐఆర్ఎస్) తెలిపారు. శుక్రవారం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అభ్యర్థుల వ్యయానికి సంబంధించి స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఏలూరు అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వ్యయ పరిశీలకులకు ఖర్చుల నమోదు ప్రక్రియను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సభ్యులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహాశీల్దార్ వి.మురార్జీ, నగరపాలక సంస్థ కమిషనర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్ వెంకట కృష్ణ ఉన్నారు.

బిజెపి, తొత్తు పార్టీలను ఓడించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలను, తొత్తు పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉండి నియోజకవర్గ సిపిఎం కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యవక్తగా బలరాం హాజరై మాట్లాడారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. మోడీ ప్రభుత్వం పదేళ్లుగా రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. ప్రకృతి వనరులను లూటీ చేసి అంబానీ, అదానీలకు పంచి పెట్టడమే మోడీ ఎజెండా అని విమర్శించారు. పేద, సామాన్య ప్రజలను తన మోసపూరిత మాటలతో బురిడీ కొట్టించారన్నారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు సైతం బిజెపికి తొత్తులుగా తయారయ్యాయన్నారు. కేంద్రంలో బిజెపి చేసిన ప్రతి పార్లమెంట్ బిల్లుకూ రెండు పార్టీలూ డూడూ బసవన్నలా తలూపాయన్నారు. ప్రజలకు నష్టం కలిగించే బిల్లులపై వ్యతిరేకించిన వారిని అరెస్టులు చేయడమే జగన్ పెద్ద పనిగా పెటుకున్నాడని ..6లో

చైతన్య ఝురి.. రాజకీయ బరి
మధ్యపేజీల్లో..

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ
3లో..

30,386.96 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
8లో..

ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ

- రామరాజు, శివరామరాజు సహకారంతో గెలిచి తీరుతా
- 21న బి ఫారమ్ తీసుకుని 22న నామినేషన్ దాఖలు
- నరసాపురం ఎంపీ రఘు రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గం నుంచి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసేది తానేనని నరసాపురం ఎంపీ కనుమూరి రఘు రాంకృష్ణంరాజు స్పష్టం చేశారు. సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు సహకారంతో తప్పక గెలిచి తీరుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. పెదఅమిరం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో రఘు రామకృష్ణంరాజు మాట్లాడారు. నరసాపురం ఎంపీ స్థానాన్ని కేటాయించాలని కోరుతూ చంద్రబాబు నాయుడు ప్రయత్నించినా, బిజెపి నాయకత్వం అంగీకరించలేదని తెలిపారు. ఉండి అసెంబ్లీ స్థానానికి పోటీ చేయాలని పార్టీ నాయకత్వం ఆదేశించిందని తెలిపారు. నరసాపురం పార్లమెంటు స్థానం కోసం గతంలో ప్రయత్నించానని ఎంపీ టిక్కెట్ తనకు దక్కకుండా చేసింది బిజెపి నాయకులు కాదని తెలిసి, తెర వెనుక ఉన్నదెవరో ..6లో

'రాష్ట్రాభివృద్ధికి టిడిపిని గెలిపించాలి'

ఎన్నికల ప్రచారంలో చింతమనేని కుమార్తె నవ్య

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లాలంటే ముందు చూపు, మంచి ప్రణాళిక ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కుమార్తె చింతమనేని నవ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తెలుగు గూడెం, పెరుగుగూడెం గ్రామంలో పెరుగు గూడెం గ్రామ మాజీ సర్పంచి యలమర్తి శ్రీనివాసరావు, హేమలత, గ్రామ టిడిపి అధ్యక్షుడు పావులూరు దశరథ రామయ్య, టిడిపి నేతలతో కలిసి నవ్య సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు మోతుకూరు నాని, టిడిపి నేతలు కమ్మ శివరామకృష్ణ, యలమర్తి ఈశ్వర ప్రసాద్ ఉన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్

ప్రజాశక్తి - చింతలపూడి

రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని, గెలిచిన తరువాత ఆంథోనీనగర్‌లో ఉన్న సమస్యలు అన్నీ పరిష్కరిస్తానని టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి మండలంలోని ఆంథోనీ నగర్ గ్రామంలో డోలా జోజి ఆధ్వర్యంలో ఇంటింటికీ టిడిపి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా, మరియ తల్లి, బాల యేసు, స్వరూపకి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వేసవిలో తస్మాత్ జాగ్రత్త

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వేసవిలో హైపర్ టెన్షన్, షుగర్ వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, వయోవృద్ధులు జాగ్రత్తగా ఉండాలని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్ సూచించారు. ఈ సందర్భంగా నూజివీడులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వేసవిలో మధ్యాహ్నం 12 గంటల లోపు బయట పనులను ముగించుకొని ఇళ్లకు చేరుకోవాలని, సాయంత్రం ఐదు గంటల తర్వాత బయటకు రావాలని, రోడ్లపైకి వెళ్లే సమయంలో గొడుగులు, చలవ కళ్లద్దాలు, టోపీ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. గర్భిణులు మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భాగస్వామ్య ప్రణాళిక కీలకం

ప్రజాశక్తి - కలిదిండి

వేసవి కార్యకలాపాలను నిర్వహించేందుకు ఉపాధ్యాయుల భాగస్వామ్య ప్రణాళిక కీలకమని ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు అన్నారు. ఆయన మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి, తరగతి ఉపాధ్యాయులు వారి విద్యార్థులు, తల్లిదండ్రులతో వాట్స్ యాప్ సమూహాలు సృష్టించి నిర్వహించవలసిన విషయాలను ఉపాధ్యాయులకు సూచించారు. వేసవి విరామంలో చదవమని, క్రీడలు, నృత్యం, యోగా వంటివి ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల పనితీరును చివరిగా సేకరించాలన్నారు. విద్యార్థుల ప్రయత్నాలను గుర్తించి పాఠశాల వెబ్‌సైట్, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ప్రదర్శించాలని ఎంఇఒ తెలిపారు.

'సృజన కనిపించడం లేదు'

కుక్కునూరు: కాంగ్రెస్ పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వెల సృజన తమకు కనిపించడం లేదంటూ నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు వ్యాఖ్యానించారు. శుక్రవారం కాంగ్రెస్ ఆరు మండలాల కన్వీనర్ల ఆత్మీయ సమావేశం కుక్కునూరులో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 రోజుల్లో ఎన్నికలు జరగనున్న వేళ కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి సృజన ఇంతవరకు నియోజకవర్గంలోని మండలాల్లో పర్యటించడం కానీ, పార్టీ కార్యకర్తలకు పరిచయం అవ్వడం కానీ, ప్రచారం చేయడం కానీ చేయలేదన్నారు. జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'మానవత' కృషి అభినందనీయం

డాక్టర్ పి.మాన్ సింగ్

నిత్యావసరాలతో పాటు దుస్తులు అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమడోలు

వివిధ రూపాలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను ఆదుకోవడంలో స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని, భీమడోలుకు చెందిన చైతన్య యువజన సంఘం అధ్యక్షులు, డాక్టర్ పి.మాన్ సింగ్ అన్నారు. ఇటీవల కాలంలో భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని అర్జావారిగూడెం ఆవాస ప్రాంతంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన ఒక కుటుంబానికి చెందిన సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శాఖ చైర్మన్ గుళ్లనూకరాజు ఆధ్వర్యంలో మానవత సభ్యులు బాధితుల నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. శాఖ తరపున వారికి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు, ఇతరాలను అందజేశారు. ఇదే క్రమంలో భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ బాధిత కుటుంబీకులకు దుస్తులు, దుప్పట్లు శాఖ ద్వారా సమకూర్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అల్లాడ ప్రసాదరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రదర్శన

భీమడోలు ఫైర్ ఆఫీసర్ జి.నాగరాజు

రోగులను రక్షించే విధానం వివరిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - భీమడోలు

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, పలు వైద్యశాలలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రోగులను రక్షించే విధానాల పట్ల భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రెస్క్యూ డెమో ప్రదర్శన నిర్వహించినట్లు భీమడోలు ఫైర్ ఆఫీసర్ జి.నాగరాజు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం భీమడోలు ఫైర్ స్టేషన్ సిబ్బంది, ఫైర్ ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో డెమో ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను బయటకు తరలించే విధానం, వారికి అందించవలసిన ప్రథమ చికిత్స విధానాల గురించి సిబ్బందికి వివరించినట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. మంటలు చెలరేగినప్పుడు వాటిని అదుపు చేసే విధానంపై ఆరోగ్య కేంద్రం వైద్యులతో పాటు సిబ్బందికి అవగాహన కల్పించామని, ప్రత్యక్ష రూపంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులతో పాటు చికిత్స కోసం వచ్చినప్పుడు పలువురు రోగులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా నిధి కింద రూ.1500 సాయం

టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

మహిళల సమస్యల వింటూ టిడిపి అధికారంలోకి రాగానే మహిళా నిధి నుంచి ప్రతినెల రూ.1500 ఆర్థిక సహాయం చేస్తానని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలవల్లి, గోగులంపాడు, కొర్లకుంట, చెక్కపల్లి, బాసవరపాడు, లోపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచార యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళకు ఆర్థిక సహాయం అందజేసే విధంగా నెలకు రూ.1500 ఇలా ఎన్నో పథకాలు టిడిపి అధికారంలోకి రాగానే ప్రవేశపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఓటర్లు రాజకీయ పార్టీలు నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా శాంతియుత వాతావరణంలో స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ డి.వెంకట్ కుమార్ కోరారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఉత్తర్వుల మేరకు పలు గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో రోడ్ మార్చ్ నిర్వహించారు. మండలంలోని పెదగొన్నూరు, అల్లూరు, కొరగుంటపాలెం గ్రామాల్లో రోడ్ మార్చ్ నిర్వహించి ఓటర్లలో మనోధైర్యం నింపారు.

ఎంఎల్ఎగా గెలవడం ఖాయం

నూజివీడు స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

నామినేషన్ వేసే సందర్భంలో కార్యకర్తల ఆదరాభిమానాలు చూసి ప్రత్యర్థి వర్గాలకు అప్పుడే భయం పట్టుకుందని, ఇదే రీతిన నూజివీడు నియోజకవర్గం ఎంఎల్ఎగా ఎన్నిక అవ్వడం ఖాయమని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో రాజకీయ వర్గాలకు అతీతంగా నామినేషన్ వేసేందుకు వెళుతున్న తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞత తెలుపుతున్నానన్నారు. ప్రస్తుతం రాజకీయాలు అన్నీ ధనంతో ముడిపడి ఉన్నాయన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఎప్పుడూ వారి వెంట నడిచే వ్యక్తినన్నారు. గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వనిత నామినేషన్‌కు తరలిన వైసిపి శ్రేణులు

ద్వారకా తిరుమల: గోపాలపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి తానేటి వనిత నామినేషన్ సందర్భంగా శుక్రవారం మండల వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కమిటీ మెంబర్లు, పార్టీ అనుబంధ విభాగ సభ్యులు బైక్‌పై ర్యాలీగా గోపాలాపురం తరలి వెళ్లారు.

పోలవరంలో మళ్లీ వైసిపిదే విజయం

తెల్లం రాజ్యలక్ష్మి

ప్రచార కార్యక్రమంలో రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో మళ్లీ వైసిపిదే గెలుపని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు విజయానికి దోహద పడతాయని, రాష్ట్రంలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యం అవుతుందని వైసిపి పోలవరం నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బంధంచర్ల, కేతవరం, అల్లంచర్ల, రాజుపాలెం పంచాయతీల్లో స్థానిక ఎంఎల్ఎ తెల్లం బాలరాజుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆమె తెలిపారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆమె తెలిపారు. చంద్రబాబు బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, తనను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి.లక్ష్మి, మండల కన్వీనర్ శ్రీనురాజు, వైసిపి ఏలూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు, సర్పంచి తడికలపూడి శివ మాధవి కిషోర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సత్రంపాడు ఏరియా, మంగా నర్సింగ్ హెూం ఏరియా, ఎన్‌టిఆర్ బొమ్మ రోడ్, విద్య వికాస్ రోడ్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జెపిబి.నటరాజన్ తెలిపారు. మండలంలోని డి3-ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ వట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ సత్రంపాడు ఫీడర్‌కు మొక్కలు కత్తిరించుటకు, లైన్లకు మరమ్మతు చేయుటకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అభ్యర్థుల వ్యయ గణనపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు, ఐఆర్ఎస్ అధికారి కీర్తి నారాయణ, రిటర్నింగ్ అధికారి వై.భవాని శంకరీ ఎన్నికల సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి అభ్యర్థులు ఖర్చు చేయవలసి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఖర్చు విషయంలో ఎన్నికల అధికారులు పరిశీలన కొనసాగించాలని తెలిపారు. వ్యయ గణనపై అధికారులకు అవగాహన కల్పించారు.

టిడిపి కూటమికే మద్దతు

ఎంఆర్‌పిఎస్ నాయకుల వెల్లడి

చాట్రాయి: రానున్న ఎన్నికలలో టిడిపి, జనసేన కూటమి అభ్యర్థికే మాదిగల మద్దతు ఉంటుందని ఎంఆర్‌పిఎస్ నూజివీడు నియోజకవర్గ నాయకులు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఎంఆర్‌పిఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంపటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎ, బి, సి, డి వర్గీకరణ సాధించడం కోసం గత కొన్ని సంవత్సరాలుగా మాదిగలు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. టిడిపి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధికి మాదిగల ఓట్లు వేసి గెలిపించుకోవాలని తెలిపారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 542/2023
I.A. No. 543/2023
I.A. No. 544/2023 in
O.S. No. 308/2016

Between:
Association for Promoting Spiritual & Socio-Economic Activities, regd. No. 571/84, rep. by its Secretary Sri. V.V.Bhaskaka Rao
...Petitioner/Plaintif
AND
Ganta Venkataratnam (died) and Others
...Respondents/ Defendants

10: Ganta Anantha Lakshmi, W/o. late Venkataratnam, Hindu, aged 52 years, House wife, resident of Sai Balaji Complex, Opp: Dwakra Building, Tanuku, W.G.Dt.,

11: Ganta Prathyusha, D/o. late Venkataratnam, Hindu, aged 29 years, resident of Sai Balaji Complex, Dwakra Building, Tanuku, W.G.Dt.,
...10, 11 Respondents/ Defendants

పై నెంబరు గ్రంథంలో 10, 11 రెస్పాండెంట్స్/ ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 24-4-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు గ్రంథంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి **జి.వి.రామలక్ష్మి**
18-4-2024 అడ్వకేట్స్, రాజమండ్రి

ప్రకృతితోనే ఆరోగ్యం

సేవ్ వ్యవస్థాపకులు విజయరామ్

ప్రజాశక్తి - కైకలూరు

ప్రకృతిని పరీక్షించడం వల్ల ప్రజారోగ్యం మెరుగవుతుందని సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయ రామ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జిఓస్ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితిలో శుక్రవారం ప్లాస్టిక్ నిషేధం, వర్షపు నీటి నిల్వ, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొంటున్న మంచినీటి సీసాతో పాటు భవిష్యత్తులో ఆక్సిజన్ సిలిండర్ కొని వీపుకు కట్టుకొని తిరగవలసిన ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రతిఒక్కరూ మార్కెట్‌లో లభించే వస్తువుల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్‌ని వాడకుండా ఉంటే మంచిదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల శ్రీ రామకృష్ణ, సేవా సమితి కార్యదర్శి శ్రీనివాసరాజు, కైకలూరు సమితి అధ్యక్షులు వేంకటేశ్వరవర్మ, మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు పవన్ కాంత్, మేడిశెట్టి పాములు పాల్గొన్నారు.

గెలుపు బాధ్యత యువతది

చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్

చింతలపూడి: గెలుపు బాధ్యత యువత తీసుకోండి, అభివృద్ధి బాధ్యత నాకు వదిలేయండని టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలో యువత జాతర కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నియోజవకర్గంలో పాలిటెక్నిక్ కాలేజీ, యువత వ్యాపారాలు చేయుటకు చేయూత నందించి, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని అన్నారు. చింతలపూడి మండలంలో 100 పడకల ఆసుపత్రి పూర్తి చేసి కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. సెంట్రల్ లైటింగ్, ఎన్నికల్లో గెలిచిన తర్వాత రోడ్లు వేయిస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని గెలిచిన రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 22న నామినేషన్ వేస్తానని యువత తరలి రావాలని కోరారు.

కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మంగినేని రాజీనామ

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మంగినేని బాబ్జి తన పదవికి శుక్రవారం రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఆయనతోపాటు మండవల్లి, కలిదిండి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సోము కాశీ విశ్వనాథ్, కోసిరెడ్డి వెంకట శ్రీరామకృష్ణ కాంగ్రెస్‌కి రాజీనామా చేసినట్లు తెలిపారు. గత 40 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ, పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నామన్నారు. పార్టీ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న తమను గుర్తించకుండా పక్కనపెట్టి తమను సంప్రదించకుండా, వేరే పార్టీ నుంచి వచ్చిన వ్యక్తికి కైకలూరు అసెంబ్లీ టికెట్ ఇవ్వడంతో తీవ్ర మనస్థాపానికి గురై కాంగ్రెస్‌కి రాజీనామా చేసినట్లు బాబ్జి తెలిపారు.

టిడిపిలోకి పలువురు

ముదినేపల్లి: మండలంలోని వనుదుర్రు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శుక్రవారం టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన వీరమల్లు రాము ఆధ్వర్యంలో, కొడాలి వినోద్ సమక్షంలో టిడిపి తీర్థం పుచుకున్నారు. నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమల నివారణకు కృషి చేయాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కీటకాలలో దోమ అత్యంత ప్రమాదకరమైనదని, అది మన రక్తాన్నే తాగి, మనకు ప్రాణాంతకమైన అంటువ్యాధులను సంక్రమింప చేస్తుందని, దోమల నిర్మూలనకు ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. మనకు ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమ మన గృహాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, వాడేసిన టైర్లు వాడేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోలు, పూల కుండలు, ఫ్లవర్ వాజ్‌లు మొదలైన స్థలాల్లో పెరుగుతాయని, కావున వారానికి ఓసారి కడిగి ఆరబెట్టుకోవాలని చెప్పారు. దోమకాటు నుంచి సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం కరువు పనులు కూలీలతో మాట్లాడుతూ అధిక వేడి వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కూలీలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, కాటన్ దుస్తులు ధరించాలని, తలపాగా ధరించాలని సూచించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ఏ విధంగా తయారు చేసుకోవాలో చూపించారు. అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేయాలి

చాట్రాయి: తీవ్ర ఎండలో పొట్టకూటి కోసం పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, ఎండ తీవ్రత తట్టుకోవడానికి ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న ఉపాధి హామీ కూలీలు వేసవికాలం కావడంతో ఎండ తీవ్రతకు తట్టుకోలేక అస్వస్థతకు గురవుతున్నారని, సంబంధిత చాట్రాయి మండల ఉపాధి హామీ కార్యాలయ అధికారులు మజ్జిగ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ డిమాండ్ చేశారు.

వెంకటేశ్వరరావును గెలిపించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

ఏలూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలలో సిపిఐ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును, పార్లమెంటుకు కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న కావూరి లావణ్యను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం స్థానిక బీడీ కాలనీ, మసీదు సెంటర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని, దానికి తొత్తులుగా మారిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను చిత్తుగా ఓడించాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నగరంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయన్నారు. నగరంలో పలుచోట్ల సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయడంలో స్థానిక ఎంఎల్ఎ విఫలం చెందారని విమర్శించారు. ఉద్యోగ, కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి, దానికి మద్దతు పలుకుతున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

వ్యక్తి మృతి : విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొనటంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం పాత చింతలపూడి వాటర్ ట్యాంక్ సమీపంలో సుమారుగా శ్రీ చైతన్య టెక్నో పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్న పాసింజర్ ఆటోను ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఆటో బోల్తా పడి వై.గోపాల్ రెడ్డి అనే 9వ తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు కాగా, పలువురికి స్వల్పగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడు బైముతక శ్రీను(40) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రస్తుతం విద్యార్థి గోపాల్‌రెడ్డి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భయాందోళనలో విద్యార్థులు

పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్నాము అనే ఆనందంతో విద్యార్థులు ఉండగా, 15 నిముషాలలో ఇంటికి చేరుకుంటాం అనే లోపు ప్రమాదం జరగటంతో విద్యార్థులు భయాందోళనకు గురైయ్యారు. ప్రమాదం జరిగిన తరువాత విద్యార్థులు భయంతో వణికిపోయారు. తల్లిదండ్రులు అక్కడే ప్రమాదం స్థలంలో చూసి కన్నీరు పెట్టుకున్నారు. కొంత మంది తల్లిదండ్రులు వెంటనే బయపడి తమ పిల్లలను ఇంటికి తీసుకువెళ్లారు.

అధ్వానమైన రోడ్ల వల్లే ప్రమాదాలు

తల్లిదండ్రుల ఆవేదన

చింతలపూడి పట్టణంలో ఉన్న కార్పొరేట్ పాఠశాలకు దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆ సంస్థకు చెందిన వ్యాన్ ఫీజులు కట్టుకోలేక ఆటో మీద పాఠశాలకు వెళ్తున్నారు. ఒకొక్క ఆటోలో 15 నుంచి చిన్న పిల్లలు ఐతే 20 మంది వరకూ ప్రయాణిస్తున్నారు. స్కూల్ యజమాన్యాలు పట్టించుకోకపోవటం, రోడ్డు రవాణా శాఖ అధికారులు తనిఖీ చేయకపోవడం, చింతలపూడి పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవటం బాధాకరమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసినా కూడా ఆటోలో పరిమితి మించి విద్యార్థులు ప్రయాణిస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరించటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఒక్క విద్యార్థి మాత్రమే గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. అదే మిగతా విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర హాస్పిటల్‌లో వైద్యం తీసుకుంటున్న విద్యార్థిని పరామర్శించి, ధైర్యం చెప్పి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ సుధాకర్, ఎస్ఐ కుటుంబరావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు

విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయ రాజు అన్నారు. చింతలపూడి మండలం పాత చింతలపూడి స్కూల్ వద్ద ద్విచక్ర వాహనం ఆటోను ఢీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతిచెందగా, విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఇంటి బయట పనిచేస్తున్న ఓ మహిళను పాము కాటు వేయడంతో చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీహరిపురం పంచాయతీలోని బిసి కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఆరే నాగ అంజలి(30) ఇళ్లలో పాచి పని చేస్తూ ఉంటుంది. ఐదేళ్లగా శ్రీహరిపురం కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటి బయట పని చేస్తుండగా పాము(రక్త పింజేరు) కాటు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్సకై ముదినేపల్లిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించటంతో మెరుగైన చికిత్సకై గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాగ అంజలి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగ అంజలి అకాల మరణంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పలువురు ఆర్థిక సాయం

భర్తకు దూరంగా ఇద్దరు పిల్లలతో ఇండ్లలో పాచి పని చేసుకుని జీవనం సాగిస్తూ ఇంట్లో పాముకాటుకు గురై మృతి చెందిన ఆరె నాగ అంజలి కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందజేశారు. నాగ అంజలి మృతి వార్త తెలుసుకున్న గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వర రావు, ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్, టిడిపి యువనేత కొడాలి వినోద్ పార్థీవ దేహాన్ని సందర్శించి, అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం మనోజ్ రూ.10 వేలు, వినోద్ రూ.10 వేలు, గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు రూ.5 వేలు మృతురాలి కుటుంబానికి అందజేశారు. నాగ అంజలి అకాల మరణంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.

అనారోగ్యంతో కోస్తాప్రభ విలేకరి మృతి

ప్రజాశక్తి - కలిదిండి

కోస్తాప్రభ విలేకరి పువ్వుల కోదండ ఫణి(38) గత కొంత కాలంగా కామెర్లతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. తొలుత నుంచి కలిదిండిలో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ వస్తున్నారు. జర్నలిజంపై మక్కువతో విలేకరిగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక ఇందిరా కాలనీలో ఆయన నివసిస్తున్నారు. కలిదిండి మండలం ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కె.విక్టర్ బాబు, జోషప్, శ్రీనివాస్, జయరాజు, దుర్గారావు కుటుంబ సభ్యులకు అందచేశారు. మృతుడు ఫణి భౌతిక కాయాన్ని నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏలూరు రోడ్డులోని లక్కీ రోడ్ లైన్స్ లారీ కార్యాలయం ఎదురుగా ఏలూరు కాలువలో సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు మధ్యగల గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం కొట్టుకొని వచ్చిందని పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతి చెందిన వ్యక్తి తెలుపు రంగు, నిలువు చారలు గల షర్ట్, నలుపు షార్ట్, నలుపు మొలతాడు కలిగి ఉన్నాడని, తెలిసిన వారుంటే తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ నెంబర్ 9440796611కు సంప్రదించమని పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

భార్యపై అనుమానంతో హత్యాయత్నం

ప్రజాశక్తి - భీమడోలు

భార్యపై అనుమానంతో ఆమెను కొట్టి, ఇంట్లో పెట్టి బయటి నుంచి గడియ వేసి, ఇంటికి నిప్పంటించి, ఆమెను చంపటానికి ప్రయత్నం చేసిన సంఘటన భీమడోలులో చోటుచేసుకుంది. భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నంగా భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు భీమడోలు గ్రామానికి చెందిన దవులూరి నాగరాజుకు అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. ఇటీవల కాలంలో భార్య ప్రవర్తనపై అనుమానంతో ప్రతిరోజు నాగరాజు మద్యం సేవించి వచ్చి భార్యను కొట్టేవాడు. ఈ విషయమై భార్య గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేసింది. ఇదే క్రమంలో ఈనెల 15వ తేదీన నాగరాజు తన భార్య వెంకటలక్ష్మిని కొట్టి, ఇంట్లో ఉంచి బయటి నుంచి గడియ వేసి ఇంటికి నిప్పంటించాడు. ఈ విషయమై భార్య శుక్రవారం భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును నమోదు చేసిన భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో జనసేన అభ్యర్థిగా బొలిశెట్టి

నామినేషన్ వేస్తున్న బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత ఆయన పెంటపాడు మండలం కస్పా పెంటపాడు బైరాగుల మఠంలో పూజలు నిర్వహించి 11 గంటలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం అభిమానులు, టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు ర్యాలీగా తాడేపల్లిగూడెం పట్టణంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్యకు అందజేశారు. ఆయన వెంట జెడ్పి మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఈతకోట తాతాజీ, టిడిపి నాయకులు వలవల బాబ్జీ, మాజీ ఎంపిపి పరిమి రవికుమార్, మాజీ జెడ్‌పిటిసిలు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గానికి శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య తెలిపారు. జనసేన తరపున బొలిశెట్టి శ్రీనివాస్ ఒక సెట్టు నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా దేవతి పద్మావతి ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారన్నారు.

భీమవరం వైసిపి అభ్యర్థిగా గ్రంధి నామినేషన్


నామినేషన్ వేస్తున్న గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం భీమవరం వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. తొలుత ఆయన మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకుని పాదయాత్ర చేసుకుంటూ ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని ఎన్నికల అధికారి శ్రీనివాసులురాజుకు నామినేషన్ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లో ఆర్థిక అసమానతలను తొలగించే విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. మరోసారి తాను గెలిచి భీమవరం నియోజకవర్గాన్ని మరింతగా రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు.

దెందులూరులో కొఠారు నామినేషన్


నామినేషన్ వేస్తున్న అబ్బయ్యచౌదరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి నామినేషన్ వేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2.58 గంటలకు దెందులూరు రిటర్నింగ్ అధికారి, జెసి లావణ్యవేణికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, కొఠారు రామచంద్రరావు ఆయన వెంట ఉన్నారు. తొలుత పెదవేగి మండలం రాట్నాలగుంటలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ముహూర్తం ప్రకారం నామినేషన్ పత్రాలపై సంతకాలు పెట్టారు. నామినేషన్ పత్రాలను తన తండ్రి, ఎపి పామాయిల్ అభివృద్ధి బోర్డు మాజీ ఛైర్మన్ కొఠారు రామచంద్రరావుకు అందజేశారు. దెందులూరు నియోజకవర్గ కార్యాలయంలో వైసిపి నేత బొద్దు సతీష్‌చౌదరితోపాటు కలిసొచ్చి రామచంద్రరావు ఆర్ఓ లావణ్యవేణికి నామినేషన్ పత్రాలు అందజేశారు. సాయంత్రం ఎంఎల్ఎ స్వయంగా వచ్చి నామినేషన్ పత్రాలను మరోసారి ఆర్ఓకు అందజేశారు. తొలుత రాట్నాలగుంట నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. పెదవేగి, గోపన్నపలెం, ఆశ్రం, కొవ్వలి, పాలగూడెం మీదుగా దెందులూరు చేరుకున్నారు.

వైసిపి అభ్యర్థిగా రంగనాధరాజు నామినేషన్

నామినేషన్ వేస్తున్న శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆచంట జనసందోహంతో కిక్కిరిసిపోయింది. పోడూరు మండలం తూర్పుపాలెంలోని వైసిపి కార్యాలయం నుంచి కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలిరాగా రంగనాథరాజు పాదయాత్రగా బయలుదేరి ఆచంట తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడుకు తన నామినేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు), నేతలు షర్మిలా రెడ్డి, చెరుకువాడ నరసింహారాజు, నేతలు పాల్గొన్నారు.


నామినేషన్ వేస్తున్న ధర్మారాజు

ఉంగుటూరు జనసేన అభ్యర్థిగా ధర్మరాజు నామినేషన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన ఉంగుటూరు నియోజకవర్గ అభ్యర్థిగా పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. ముహూర్తం ప్రకారం శుక్రవారం నామినేషన్ వేశానిని, కార్యకర్తలు, అభిమానులు, టిడిపి, జనసేన, బిజెపి నేతల ఆధ్వర్యాన ఈ నెల 23న భారీ ఊరేగింపుతో మరోసారి నామినేషన్ వేయనున్నట్లు ధర్మరాజు చెప్పారు.

కైకలూరు కాంగ్రెస్ అభ్యర్థిగా నోబుల్ నామినేషన్

నామినేషన్ వేసేందుకు వెళ్తున్న నోబుల్

ప్రజాశక్తి - కైకలూరు

భారీ జనసందోహం నడుమ శుక్రవారం ఇండియా కూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్ నామినేషన్ వేశారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ నేతలు వెంట రాగా కైకలూరులోని తన నివాసం నుంచి భారీ ర్యాలీగా తహశీల్దార్ కార్యాల యానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డివిఎస్‌విడి.ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కురెళ్ల ఇస్సాక్, లాజర్, దండే సైమన్, అలెక్స్, అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థిగా ముదునూరి నామినేషన్

నామినేషన్ వేస్తున్న ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్ఓ ఎం.ఎ.అంబరీష్‌కు నామినేషన్ అందచేశారు. మొగల్తూరు మండలంలోని పాతపాడు నుండి మొగల్తూరు, సీతారామపురం నరసాపురం వరకూ ర్యాలీ నిర్వహించారు

చైతన్య ఝరి.. రాజకీయ బరి

దెందులూరు.. పెదవేగి రాజధానిగా చేరుకుని వేంగిరాజులు ఏలిన చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతం. రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. ఎందరో రాజకీయ ఉద్దండులు, ప్రముఖులను అందించిన మొట్ట ప్రాంతం. నైసర్గికంగా ఏలూరు నియోజకవర్గానికి చుట్టూ ఉండడం నియోజకవర్గం ప్రత్యేకతే.

అసెంబ్లీ నియోజకవర్గం : దెందులూరు
మండలాలు: దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్
పార్లమెంట్ నియోజకవర్గం: ఏలూరు
ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు: 15
మొత్తం ఓటర్లు: 2,23,777
పురుషులు: 1,09,465
మహిళలు : 1,14,305
ఇతరులు : 7

మొత్తం 15 సార్లు ఎన్నికలు

రసవత్తరంగా దెందులూరు రాజకీయం

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ పరిధిలో కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు కలిగిన మండలం పెదవేగి. దీంతో ఈ మండలంపై పట్టు సాధిస్తున్న వారినే ఎన్నికల్లో విజయం వరిస్తూ వస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 2,62395 మంది జనం ఉండగా పురుషులకంటే మహిళలే నియోజకవర్గంలో అధికంగా ఉన్నారు. దీంతో మహిళా ఓటర్లను ఆకట్టుకుంటే విజయం సాధించొచ్చనే భావనతో నాయకులు మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత వరుసగా రెండుసార్లు గెలిచిన ఎంఎల్ఎల్లో ప్రభాకర్ మూడోవ్యక్తి. అంతకుముందు మొటపర్తి రామ్మోహన్‌రావు 1962, 1967ల్లో వరుసగా రెండుసార్లు గెలవగా, తరువాత 1972లో మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ అందుకున్నారు. గారపాటి సాంబశివరావు 1983, 1985లోనూ, తిరిగి 1994, 1999ల్లో వరుసగా గెలిచారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి మాగంటి బాబు గెలుపొందగా, 2009, 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ వరుసగా రెండుసార్లు గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి కొఠారు అబ్బాయ్యచౌదరి విజయం సాధించారు.

విశిష్ట భూమి దెందులూరు



దెందులూరు నియోజకవర్గం మెట్ట, డెల్టాల సమ్మిళితం. పెదవేగి మండలం పూర్తిగా మెట్ట ప్రాంతం కాగా, దెందులూరు సగం మెట్ట, సగం డెల్టాగా ఉంది. పెదపాడు మూడొంతులు డెల్టాగా, కొద్దిగా మెట్ట ఉంది. ఏలూరు రూరల్ గ్రామాలు కొల్లేరుకు అనుసంధానంగా ఉన్నాయి. దీంతో నియోజకవర్గంలో అన్ని సామాజిక తరగతుల ప్రాబల్యం ఉంటుంది. కొల్లేరు కాంటూరు కుదింపు కోసం కొల్లేరువాసులు ఎదురుచూస్తున్నారు. ఈ నియోజకవర్గం 1955లో ఏర్పడింది. నాటినుంచి ఇప్పటి వరకు ఉప ఎన్నికలతో కలుపుకుని 15 సార్లు ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ ఏడుసార్లు, టిడిపి ఆరుసార్లు గెలవగా ఒకసారి స్వతంత్ర అభ్యర్థి, వైసిపి అభ్యర్థి ఒకసారి గెలుపొందారు.

మూడుసార్లు మంత్రి పదవులు

దెందులూరు నియోజకవర్గానికి మూడుసార్లు మంత్రి పదవి వచ్చింది. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన మాగంటి రవీంద్రనాథ్‌చౌదరి దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రిగా పని చేశారు. మంత్రిమండలి పునర్వ్యవస్థీకరణలో పంచాయ తీరాజ్ శాఖామంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపట్లోనే ఆయన మృతి చెందారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో మాగంటి రవీంద్రనాథ్ చౌదరి సతీమణి వరలక్ష్మీదేవి గెలుపొంది రాష్ట్రమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2004లో ఎంఎల్ఎగా ఎన్నికైన మాగంటి బాబు రాష్ట్రమంత్రిగా పనిచేశారు. మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గానికి మంత్రి పదవులు వచ్చాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1955	మూల్పూరి రంగయ్య	కాంగ్రెస్	జి.సత్యనారాయణ	సిపిఐ
1962	మొటపర్తి రామ్మోహనరావు	స్వతంత్ర	గారపాటి చిన్నకశయ్య	కాంగ్రెస్
1987	మొటపర్తి రామ్మోహనరావు	కాంగ్రెస్	కెవి.సదాశివరావు	స్వతంత్ర
1972	మొటపర్తి రామ్మోహనరావు	కాంగ్రెస్	ఏకగ్రీవం	
1978	నీలం చార్లెస్	కాంగ్రెస్	గారపాటి కృష్ణమూర్తి	జనతా
1983	గారపాటి సాంబశివరావు	టిడిపి	నీలం చార్లెస్	కాంగ్రెస్
1985	గారపాటి సాంబశివరావు	టిడిపి	ఎం.పద్మావతి	కాంగ్రెస్
1989	మాగంటి రవీంద్రనాథ్‌చౌదరి	కాంగ్రెస్	గారపాటి సాంబశివరావు	టిడిపి
1991 (ఉఎ)	మాగంటి వరలక్ష్మిదేవి	కాంగ్రెస్	గారపాటి సాంబశివరావు	టిడిపి
1994	గారపాటి సాంబశివరావు	టిడిపి	పాతూరి జాన్సీల్	కాంగ్రెస్
1999	గారపాటి సాంబశివరావు	టిడిపి	కొమ్మారెడ్డి మాధవరావు	కాంగ్రెస్
2004	మాగంటి బాబు	కాంగ్రెస్	గారపాటి సాంబశివరావు	టిడిపి
2009	చింతమనేని ప్రభాకర్	టిడిపి	కొఠారు రామచంద్రరావు	కాంగ్రెస్
2014	చింతమనేని ప్రభాకర్	టిడిపి	కారుమూరి నాగేశ్వరరావు	వైసిపి
2019	కొఠారు అబ్బయ్యచౌదరి	వైసిపి	చింతమనేని ప్రభాకర్	టిడిపి

కరాచలనం చేసుకుంటున్న నేతలు

ముదునూరి, నాయకర్ కరాచలనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం రాజకీయాల్లో శుక్రవారం ఆసక్తికర సన్నివేశం జరిగింది. వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తుండగా మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ ఎదురుపడ్డారు. అదే గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపడుతున్న నాయకర్ అటుగా వెళ్తున్న ప్రసాదరాజు జీపు దగ్గరకి వెళ్లి నాయకర్ శుభాకాంక్షలు తెలిపారు. అప్పుడు 2019 ఎన్నికల్లో, ఇప్పుడు 2024 ఎన్నికల్లోనూ ప్రసాదరాజు, నాయకర్ ఇద్దరూ రాజకీయ ప్రత్యర్థులు. వారు ఇరువురూ నవ్వుకుంటూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవడంతో ఇరు పార్టీల నేతలు ఆసక్తిగా చూశారు.

అట్టహాసంగా మాజీ మంత్రి పితాని నామినేషన్

ఆచంటలో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి పెద్దఎత్తున జనం తరలిరావడంతో ఆచంట కిటకిటలాడింది. పితాని స్వగ్రామం పోడూరు మండలం కొమ్ముచిక్కాల నుంచి కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలొచ్చారు. యువత ద్విచక్ర వాహనాలపై కేరింతలు కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు. నెలమూరు, ఓడూరు, ఆలమూరు, వెలగలేరు, మార్టేరు మీదుగా ర్యాలీ ఆచంట చేరుకుంది. పితాని ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ స్థానిక కచేరీ సెంటర్‌కు చేరుకుని వేలాదిగా తరలొచ్చిన కార్యకర్తలతో పాదయాత్రగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, మాధవనాయుడు, బిజెపి ఎంపీ అభ్యర్థి వర్మ, నేతలు పాల్గొన్నారు.

పెనుమంట్ర: టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణ మార్టేరులో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేశారు. పెద్దఎత్తున టిడిపి, జనసేన కార్యకర్తలు పితాని వెంట ర్యాలీలో పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట నియోజకవర్గానికి శుక్రవారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి వి.స్వామి తెలిపారు. వైసిపి తరపున చెరుకువాడ శ్రీరంగనాథరాజు రెండు సెట్లు, చెరుకువాడ వెంకట నరసింహారాజు రెండు సెట్లు, టిడిపి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ మూడు సెట్లు, పితాని వెంకట సురేష్ ఒక సెట్టు నామినేషన్లు వేసినట్లు చెప్పారు.

నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 10 గంటలకు ఉమాబాల తన నివాసం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నామినేషన్ పత్రాలను కలెక్టర్, రిటర్నింగ్ అధికారి సుమిత్‌కుమార్‌కు అందజేశారు. నామినేషన్ల అనంతరం ఉమాబాల మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్మోహన్‌రెడ్డి ఒక బిసి మహిళకు ఎంపీ టికెట్ కేటాయించారన్నారు. జిల్లాలో ఏడు ఎంఎల్ఎ, ఎంపీ సీటు అత్యధిక మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, గోకరాజు నరసింహులు, కోరుకొల్లు బాబు, జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి శ్రీనివాసరావు, మేడిది జాన్సన్ , జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడే. యుగంధర్, కోడే విజయలక్ష్మి, బీసీ నాయకులు చెల్ల బొయిన పాపారావు, బోల్ల శ్రీనివాస్, వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణ నామినేషన్


నామినేషన్ వేస్తున్న రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

టిడిపి తణుకు అభ్యర్థిగా ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత పాలంగి రోడ్డులోని తన నివాసం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఉండ్రాజవరం జంక్షన్ జాతీయ రహదారి నుండి శర్మిష్ట సెంటర్ మీదుగా వెంకటేశ్వర సెంటర్, నరేంద్ర సెంటర్ మీదుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ఆరిమిల్లి రాధాకృష్ణ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి బివి.రమణకు అందజేశారు. ఆరిమిల్లి సతీమణి కృష్ణతులసి కూడా నామినేషన్ వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కి అందజేశారు. నామినేషన్ దాఖలు సమయంలో ఆయన వెంట దొమ్మేటి వెంకటసుధాకర్, పరిమి వెంకటేశ్వరరావు, ఎన్‌విఎస్ రామానుజం పాల్గొన్నారు.

తణుకులో కారుమూరి నామినేషన్

ప్రజాశక్తి - తణుకు రూరల్

వైసిపి తణుకు అభ్యర్థిగా డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు శుక్రవారం ఉదయం నామినేషన్ వేశారు. తొలుత సజ్జాపురంలోని వైసిపి కార్యాలయం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కారుమూరి పాదయాత్రగా బయల్దేరారు. వెంకటేశ్వర సెంటర్, నరేంద్ర సెంటర్ మీదుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. కారుమూరి రెండు సెట్ల నామినేషన్లు రిటర్నింగ్ అధికారి బివి.రమణకు అందజేశారు. కారుమూరి సతీమణి లక్ష్మీకిరణ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కారుమూరి వెంట ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, కారుమూరి అల్లుడు దిలీప్‌కుమార్, మాజీ ఎంసి ఛైర్మన్ చిట్టూరి సుబ్బారావు, బోడపాటి వీర్రాజు, పెన్మెత్స సుబ్బరాజు పాల్గొన్నారు.

సైకిల్‌పై వెళ్లి నామినేషన్ వేసిన నిమ్మల


నామినేషన్ వేస్తున్న నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు శుక్రవారం సైకిల్‌పై వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో బిజెపి నేత కబర్ధి, సినీ నిర్మాత బన్నీవాసు కొంతదూరం ఎంఎల్ఎతోపాటు సైకిల్‌పై వెళ్లారు. రామానాయుడు వెంట పెద్దసంఖ్యలో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

4 నామినేషన్లు దాఖలు

పాలకొల్లు నియోజకవర్గంలో శుక్రవారం రెండో రోజు నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. టిడిపి తరపున ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఆమె సతీమణి సూర్యకుమారి, కాంగ్రెస్ తరపున కొలుకులూరి అర్జునరావు, ఆయన సోదరుడు కొలుకులూరి నాగ భాస్కరరావు నామినేషన్లు రిటర్నింగ్ అధికారి బి.నారా యణరెడ్డికి అందజేశారు. డిఎస్‌పి శ్రీనివాసరావు సారథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉండిలో ఎనిమిది నామినేషన్లు


నామినేషన్ వేస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండోరోజు నలుగురు అభ్యర్థులు ఎనిమిది నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్ఓ సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. టిడిపి అభ్యర్థిగా కనుమూరి రఘురామకృష్ణంరాజు తరపున ఆయన భార్య కనుమూరి రమాదేవి, కాంగ్రెస్ అభ్యర్థిగా వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, వైసిపి అభ్యర్థిగా పెనుమత్స వెంకట లక్ష్మినరసింహరాజు, పెనుమత్స గోపాలకృష్ణంరాజు నామినేషన్ పత్రాలను అందజేసారని ఆర్ఓ తెలిపారు.

తరలిన అభిమానులు

ఆకివీడు : ఉండిలో వైసిపి అభ్యర్థి పివిఎల్ నామినేషన్‌కు పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.

కాళ్ల: ఈసారి ఉండిలో వైసిపి జెండాను ఎగురవేస్తామని ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. శుక్రవారం పెదఅమిరం వైసిపి కార్యాలయం నుంచి ఆయన నామినేషన్ వేసేందుకు ర్యాలీగా తరలివెళ్లారు. ఆయన వెంట ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ డెవలప్మెంట్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎపి ఫారెస్ట్ అండ్ సాంస్కృతిక డైరెక్టర్ మంతెన యోగేంద్రవర్మ, టిటిడి సభ్యులు గాదిరాజు సుబ్బరాజు, మోటుపల్లి గంగాధర్‌రావు పాల్గొన్నారు.

అది విష నాగుల కూటమి

ఊరు బాగు కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నా : మంత్రి కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అది కాలకూట విష నాగుల కూటమి అంటూ టిడిపి, జనసేన, బిజెపి కూటమిపై డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ విరుచుకుపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ కూటమిలో ఉన్న వారంతా పేకాటరాయుళ్లేనని ఘాటుగా విమర్శించారు. తాను రాజకీయాల్లో కొనసాగేది తన కోసం కాదని, ఊరు బాగు కోసమేనని స్పష్టం చేశారు. ఏడవ సారి పోటీలో ఉన్నానని తనకేది కొత్త కాదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలు మారడం, చేరడం సహజమేనన్నారు. తాను ఎవరినీ ద్వేషించలేదని, దూరంగా పెట్టలేదని స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో కొంతమంది సీనియర్లు తప్పుడు రాజకీయాలు చేసే తనకు టిక్కెట్టు రాకుండా అడ్డుకున్నారన్నారు. అయినా తాను వెనక్కు తగ్గకుండా ఊరు చెడిపోకూడదు అనే ఉద్దేశంతో స్వతంత్రంగా నిలబడి పోటీ చేశానన్నారు. ఆ నాడు తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడించాననే కక్షతో నేడు ఆ విష నాగులన్నీ మళ్లీ ఒకచోటకు చేరాయన్నారు. వాళ్లలో వాళ్లకు అనేక గొడవలు ఉన్నాయని, తన దగ్గరకు వస్తే పరిష్కరించి పంపించానని, ఇది నిజం కాదా చెప్పాలని సవాల్ విసిరారు. ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెంలో ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా వ్యాపారం చేసుకోవడానికి తాను కాపాడుతానని నమ్మకం వ్యాపారులకు ఉందన్నారు. శాంతి భద్రతలను కాపాడి మహిళలకు రక్షణ కల్పిస్తానని తెలిపారు. ప్రజలంతా తిరిగి వైసిపిని గెలిపించడానికి జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి సంసిద్ధులుగా ఉన్నారన్నారు. ఇది చూసి తట్టుకోలేక కాలకూట నాగులన్నీ ఒకచోట చేరి విషాన్ని చిమ్ముతున్నాయన్నారు. మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో ఓటు అనే వజ్రాయుధంతో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు.

బస్టాండ్‌లో కార్గో సదుపాయం

డిపో మేనేజర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఆర్‌టిసి బస్టాండ్‌లోని కార్గో కార్యాలయం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఇంటి సామాగ్రి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా చేయడానికి కంటైనర్ సదుపాయం కలదని తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. తాడేపల్లిగూడెం డిపో పరిధిలో కార్గో పార్సిల్ విభాగం ద్వారా కొరియర్, పార్సెల్ బుకింగ్ చేయడానికి ఈ క్రింది ప్రాంతాల నుంచి (పెంటపాడు, పెనుమంట్ర) మండలములలో బుకింగ్ ఏజెంట్లు కావలెనన్నారు. ఆసక్తిగల వారు వివరాల కోసం డిపో మేనేజర్ 9959225488, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జి.మాధవరావు సెల్ నెంబర్ 9949052004 సంప్రదించవలెనని డిపో మేనేజర్ తెలిపారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతుల అభిమతానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అందించాలని విస్తరణ సంచాలకులు డాక్టర్ కెఎస్-ఎస్.నాయక్ అన్నారు. మండలంలోని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించిన గోదావరి మండల పరిశోధన, విస్తరణ మండలి తొలి రోజు సమావేశానికి పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెఎస్ఎస్.నాయక్ మాట్లాడారు. గ్రామీణ యువత అవసరాలకు అనువైన వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలు రూపొందించి విధిగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ డి.శ్రీనివాస్, రాజమండ్రి వ్యవసాయ కళాశాల అధిపతి డాక్టర్ కెవి.రమణ, జిల్లా వ్యవసాయ అధికారులు వెంకటేశ్వరావు, ఎస్.మాధవరావు, హబీబ్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజి (అటానమస్)లోని ప్లేస్‌మెంట్ విభాగం వారు ఏప్రిల్ 15వ తేదీన కళాశాల క్యాంపస్‌లో ఎడ్యుహాలిక్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలో 23 మంది విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు వార్షిక ఆదాయం రూ.2 లక్షలని, వీరు విశాఖ పట్టణం లేదా కాకినాడలో విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ యు.లక్ష్మీసుందరీబాయ్ అభినందించారు.

'కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీనుల అభ్యున్నతి'

ప్రజాశక్తి - ఉండి

బడుగు, బలహీనుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. ఉండి తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనను రానున్న ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలనికి కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిసిసి కార్యదర్శి జంపన సుబ్రహ్మణ్యంరాజు, అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'బిజెపిని ఓడించాలి'

ప్రజాశక్తి - ముసునూరు

కేంద్రంలో బిజెపిని ఓడించాలని కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి మరీదు కృష్ణ అన్నారు. నూజివీడు సిపిఐ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు.

22న హరికుమార్ రాజు నామినేషన్

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 22వ తేదీన తాను నామినేషన్ వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి హరికుమార్‌రాజు తెలిపారు. నామినేషన్ వేయడానికి పిప్పర గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి భారీ ర్యాలీగా ఉంగుటూరు వెళ్తున్నట్లు తెలిపారు. 22న ఉదయం పిప్పర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ న్నట్లు చెప్పారు. నామినేషన్ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, ఇండియా వేదిక నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని కోరారు.

22న నాయకర్ నామినేషన్

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 22వ తేదీన జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు బొమ్మిడి నాయకర్ తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ముత్యాలపల్లి శ్రీ బండిముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి మొగల్తూరు, సీతారామపురం, సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పలు సచివాలయాల్లో వాలంటీర్లు రాజీనామా చేశారు. వేములదీవి వెస్ట్‌లో ఇద్దరు, లక్ష్మణేశ్వరంలో ఇద్దరు, సరిపల్లిలో ఒకరు, కె.నవరసపురం ఒకరు, వేములదీవి ఈస్ట్‌లో 13 మంది, చిట్టవరంలో ఒకరు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ రమణరావు తెలిపారు.

రెండో రోజు 29 నామినేషన్లు

(మొదటి పేజీ నుంచి)

బొలిశెట్టి శ్రీనివాస్‌తోపాటు కాంగ్రెస్, ఇతరుల నామినేషన్లు దాఖలయ్యాయి. ఉండిలో కనుమూరి రఘురామకృష్ణంరాజు తరఫున ఆయన కుటుంబీకులు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన టిడిపి నుంచే ఆయన అభ్యర్థిగా ఉంటారా, లేదా అనే మీమాంస కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల్లో మొత్తం 37 నామినేషన్లు దాఖలయ్యాయి.

బిజెపి, తొత్తు పార్టీలను ఓడించండి

(మొదటి పేజీ నుంచి)

విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచారన్నారు. నల్ల ధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి జన్ ధన్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానని మోసం చేశారన్నారు. నిరుద్యోగం పెరిగిందన్నారు. మటుమాయం చేస్తానని మోడీ కల్లబొల్లి కబుర్లు చెప్పి రెండు సార్లు ప్రధాని అయ్యారని విమర్శించారు. మోడీ జపం చేస్తున్న వైసిపి, టిడిపి జనసేనను ఓడించాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు దనికొండ.శ్రీను, శేషపు అప్పియ్య, డొకల లక్ష్మి, పెంకి అప్పారావు, బి.రాంబాబు, డి.రవితేజ మాట్లాడారు.

అధికారుల ఉదాశీనత

(మొదటి పేజీ నుంచి)

నామినేషన్లు స్వీకరించే తహశీల్దార్ కార్యాలయం గేటు వద్దకు వెళ్లిన పరిస్థితి నెలకొంది. పోలీసులుగాని, రిటర్నింగ్ అధికారిగాని ఏమాత్రం అడ్డు చెప్పని పరిస్థితి కన్పించింది. అంతకు ముందు నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లు ఏ విధంగా జరిగాయో చూసేందుకు సైతం పోలీసులు మీడియాకు అనుమతి ఇవ్వలేదు. ఎన్నికల సంఘం నిబంధనలు ఒప్పుకోవడం లేదని తెలిపారు. నామినేషన్ వేసేందుకు ఆళ్ల నాని వచ్చే సమయంలో మాత్రం అన్నింటినీ మరిచి వ్యవహరించారు. అధికార పార్టీ నాయకులు కాబట్టి పోలీసులు ఈ విధంగా వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఏలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సైతం దీనిపై మారుమాట్లాడని పరిస్థితి నెలకొంది. నామినేషన్ల పర్వం ఇప్పుడే ప్రారంభమైంది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో పెద్దఎత్తున నామినేషన్లు వేసే అవకాశం ఉంది. ఏలూరులో మాదిరిగానే జిల్లాలోని పోలీసులు, రిటర్నింగ్ అధికారులు వ్యవహరిస్తే సమస్యలు మరింత తీవ్రతరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల నిబంధనల అమలులో అధికారులు ఉదాశీనంగా వ్యవహరించడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగితే ఘర్షణలు, ఆందోళనలు కొనసాగే పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఏలూరులో జరిగిన ఘటనపై జిల్లా ఎన్నికల అధికారి విచారణ చేపట్టి ఎన్నికల నిబంధనలు అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. మున్ముందు జరగనున్న నామినేషన్ల ప్రక్రియలో ఇటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేసినప్పుడు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగే అవకాశం ఉంటుంది. లేకపోతే పోలింగ్ రోజు ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉంది. పోలీసులకు, రిటర్నింగ్ అధికారులకు, జిల్లా కలెక్టర్, ఎస్‌పి కచ్చితమైన నిబంధనలు అమలయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని అంతా కోరుతున్నారు.

ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ

(మొదటి పేజీ నుంచి)

తెలుసుకున్న తర్వాత ప్రయత్నం చేయడం మానేశానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తాను రామరాజు, శివరామరాజు సంపూర్ణ సహకారంతో గెలవబోతున్నానని తెలిపారు. త్వరలోనే వారిద్దరినీ కలిసి తన గెలుపుకు సహకరించాలని అభ్యర్థిస్తానని తెలిపారు. వారు కచ్చితంగా సహకరిస్తారని, రానున్న ఎన్నికల్లో అద్భుత విజయాన్ని సాధిస్తాననే నమ్మకం తనకుందని తెలిపారు. రామరాజు టిడిపిలోనే ఉన్నారని, ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారనే ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. రామరాజు తనతో కలిసి నడవాల్సిన అవసరం లేదని, తానే ఆయనతో కలిసి నడుస్తానని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. రామరాజు మంచి వ్యక్తి అన్నారు. నరసాపురం లోక్ సభ టిక్కెట్ దక్కకపోవడం వల్లే, తాను పోటీ చేయాల్సిన అవసరం ఉందని భావించడం వల్లే సొంత ఊరైన ఉండి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. ఉండి అసెంబ్లీ స్థానానికి తన అభ్యర్థిత్వం కరెక్ట్ అని, రామరాజు అభ్యర్థిత్వం కరెక్ట్ కాదని కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఎంపీ టికెట్ దక్కకపోవడంతో, ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. రామరాజును పార్టీ నాయకత్వం తన కంటే ఎక్కువగా గౌరవిస్తుందని నమ్మకం ఉందన్నారు. ఉండి అసెంబ్లీ స్థానానికి టిడిపి అభ్యర్థిగా శనివారం అధికారికంగా ప్రకటించనున్నారని రఘు రామకృష్ణంరాజు తెలిపారు. ఎంఎల్ఎ అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించిన తర్వాత ఈ నెల 21వ తేదీన విజయవాడలో పార్టీ అభ్యర్థులకు బి ఫారమ్ అందజేయనున్నారని తెలిపారు. శుక్రవారం ఒక సెట్ నామినేషన్ పత్రాలను తన అబ్బాయి రిటర్నింగ్ అధికారికి సమర్పించారని, ఈ నెల 22వ తేదీన అధికారికంగా నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు. పాలకోడేరు మండలం కొండేపూడి నుంచి ప్రచారం ప్రారంభించనున్నామని చెప్పారు.

సిఎస్, ఇన్‌ఛార్జి డిజిపి, ఇంటలిజెన్స్ చీఫ్‌ను తక్షణం బదిలీ చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్), ఇన్‌ఛార్జి డిజిపి, ఇంటలిజెన్స్ చీఫ్‌ను తక్షణం బదిలీ చేయాలని రఘు రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కంటే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇన్‌ఛార్జి డిజిపిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారి ఒక అడుగు ముందుకేసి, ఆరోపణలన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘం అధికారి రాజీవ్‌కుమార్‌కు నివేదిస్తామని తెలిపారన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరగాలంటే, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగినట్లు కనిపించాలంటే, తక్షణం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, ఇన్‌ఛార్జి డిజిపిని, ఇంటలిజెన్స్ చీఫ్‌ను బదిలీ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం అత్యంత అవసరమన్నారు.

కడప కోర్టు ఆదేశాలను హైకోర్టు కొట్టేయొచ్చు..

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై మాట్లాడొద్దని కడప కోర్టు ఇచ్చిన ఆదేశాలను హైకోర్టును ఎవరైనా ఆశ్రయిస్తే కొట్టి వేయొచ్చని రఘు రామకృష్ణంరాజు తెలిపారు. ప్రతివాదిగా తన పేరు చేర్చి ఉంటే, కచ్చితంగా తాను హైకోర్టును ఆశ్రయించి ఉండేవాడినన్నారు. పబ్లిక్ డొమైన్‌లో ఉన్న అంశంపై మాట్లాడొద్దని కడప కోర్టు ఆదేశించడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లోని అంశాలన్నీ పబ్లిక్ డొమైన్లో ఉన్నట్లేనని గుర్తు చేశారు. ఈ అంశాలపై మాట్లాడకూడదని నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్, షర్మిల, సునీతారెడ్డిని కోర్టు ఆదేశించినట్లుగా తెలిసిందన్నారు.

21న భీమవరం సభను విజయవంతం చేయండి

ఈ నెల 21వ తేదీన భీమవరంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొననున్న సభను భీమవరం, ఉండి అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు విజయవంతం చేయాలని రఘు రామకృష్ణంరాజు కోరారు. ఈ సభకు ఇతర ప్రాంతాల నుంచి జనాలను తీసుకురావాల్సిన అవసరం లేదని, పవన్‌కళ్యాణ్ సభకు ప్రజలు తండోపతండాలుగా వస్తారన్నారు.

మీ నిర్ణయమే.. నా నిర్ణయం

చంద్రబాబు కలుస్తా : ఎంఎల్ఎ రామరాజు

భీమవరం రూరల్ : 'మీ నిర్ణయమే నా నిర్ణయమని, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, టిడిపి ఉండి సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు రాంబాబు అన్నారు. శుక్రవారం భీమవరంలోని ఆయన కార్యాలయంలో ఉండి నియోజవర్గ కార్యకర్తలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ గత 20 రోజుల నుంచి టిక్కెట్‌పై అనేక సమస్యలు నెలకొన్నాయని, ఇది అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఈనెల 20వ తేదీ శనివారం చంద్రబాబు తనను కలవమన్నారని, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను తీసుకెళ్లి కలుస్తానని తెలిపారు. ఏదేమైనా ఉండి నియోజకవర్గంలో తొమ్మిది సార్లు ఎన్నికలు జరిగాయని, ఎనిమిసార్లు టిడిపి విజయం పొందడం కార్యకర్తల కృషి, పట్టుదలేనని తెలిపారు. తన వెంట ఉంటూ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేయడంలో కార్యకర్తలు ఎంతో కృషి చేశారని తెలిపారు. తన ఎన్నికల ప్రచారంలో భాగంగా డోర్ టు డోర్ 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు తెలిపారు. ఏదేమైనా అధినేత చంద్రబాబు కలిసిన తర్వాత మరోమారు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేస్తానని, తర్వాత కార్యకర్తల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాలను అభివృద్ధి చేశాం

ఎంఎల్ఎ ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

తీర ప్రాంత గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశామని నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ తాము మరోసారి అధికారంలోకొస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలో 23వ వార్డులో ప్రసాదరాజు సతీమణి శారదవాణి ఎన్నికల ప్రచారం చేశారు.

బొక్కావారిపాలెంలో అంజిబాబు ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ఆరో వార్డు బొక్కవారిపాలెంలో జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎంఎల్ఎగా ఉన్న సమయంలో భీమవరం నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానని, మరోసారి తనను గెలిపిస్తే భీమవరం పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని చెప్పారు. పట్టణంలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మకు యాత్రికులు కానుకలు, మొక్కుబడుల రూపంలో హుండీలో సమర్పించుకున్న ఆదాయాన్ని ఈ నెల 20వ తేదీ శనివారం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకురి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే వారు ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రాంగణానికి రావాలని తెలిపారు.

జగన్‌ను కలిసిన తేతలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

తణుకులో బస్సు యాత్రలో ఉన్న సిఎం జగన్‌ను తాను కలిసినట్లు వైసిపి టౌన్ అధ్యక్షులు తేతలి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జగన్ బస్సుయాత్రకు విశేష స్పందన వస్తుందన్నారు. పేదలు, అవ్వాతాతలు ఎండను లెక్క చేయకుండా అభిమానంతో జగన్ చూసేందకు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైసిపి మళ్లీ అధికారంలోకొస్తుందని, ఆచంట నుంచి శ్రీరంగనాథరాజు భారీ మెజారిటీతో గెలుస్తారన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు గౌడ్ సెంటర్‌లో పురాణాదిమ్మ వద్ద శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. కీర్తిశేషులు తొంటా చిట్టియ్య జ్ఞాపకార్థం వారి కుమారులు పెద్దిరాజు, స్వామి, చంద్రం ఈ మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే మరో కొన్నిరోజులు చలివేంద్రం కొనసాగిస్తామన్నారు. సేవా దృక్పథంతో ముందుకొచ్చి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నరసాపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం నరసాపురం కేంద్ర అగ్నిమాపక అధికారి కె.రామ్‌భాస్కర్, సిబ్బంది ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రిలో సిబ్బందికి అగ్నిమాపక పరికరాలు పనితీరును డెమో చేసి చూపించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు డాక్టర్లు, నర్సులు ప్రాణాలు రక్షించుకోవడంతో పాటుగా రోగులు ప్రాణాలు ఏవిధంగా రక్షించాలో చూపించారు. అగ్నిమాపక నిరోధకలు, పరికరాలను ఉపయోగించే విధానం గురించి వివరించారు.

నరసాపురంలో...

తాడేపల్లిగూడెం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం స్థానిక అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం యూనియన్ హాస్పిటల్, యశోద, సత్య ఆసుపత్రుల్లో వైద్యులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తగు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు, సిబ్బంది ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగినపుడు ఎలా వ్యవహరించాలో తెలుపుతూ డెమో నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట గోపాలకృష్ణంరాజు

ర్యాలీలో గోపాలకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజలు అవకాశం ఇస్తే ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు నుంచి ఉండి నామినేషన్ వేసేందుకు ర్యాలీగా బయలు దేరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సోడదాసి గంగయ్య, ఆకివీడు మండలాధ్యక్షులు చింతా ఆదిశేషు, కాళ్ల మండలాధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు జెఎస్ఆర్, బొర్రా పార్థు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేసి దేశాన్ని కాపాడండి

ఆకివీడు : కాంగ్రెస్‌కు ఓటు వేసి మతతత్వ వాదుల నుంచి దేశాన్ని కాపాడాలని ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి గోపాలకృష్ణంరాజు కోరారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సిపిఎం నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మరొకసారి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బ్లాక్ పార్టీలు అన్ని సమన్వయంతో తనని ఎంపిక చేశాయని చెప్పారు. తొలుత ఆయన తనని తాను కార్యకర్తలకు పరిచయం చేసుకున్నారు. గతంలో తాను కాళ్ల మండల ఎంపిపిగా పని చేశానని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందాలని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. ఎన్‌టిఆర్.జంక్షన్, యాగర్లపల్లి, కడకట్ల ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 28, 14, 15, 16 వార్డుల్లో డ్రై డే, ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఆయన శుక్రవారం పరిశీలించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ వివరాలను ప్రతివారం క్లస్టర్ స్థాయిలో గుర్తించి వాటిని వార్డ్ శానిటేషన్ కార్యదర్శుల సహకారంతో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు చంద్ర, చంద్రకళ, ప్రశాంతి, అంబిక, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

ఆక్వా రంగం అభివృద్ధికి కృషి : శివరామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి ఎంఎల్ఎగా పదేళ్లు పనిచేసి ఆక్వా రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, ప్రస్తుతం ఈ రంగం కుదేలైందని, ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఆక్వా రంగా అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఉండి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వెంకట శివరామరాజు అన్నారు. శృంగవృక్షంలో శివరామరాజు శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆక్వా రైతులు, ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ గతంలో పెట్టుబడులు తక్కువగా ఉండడంతో పాటు లాభాలు పుష్కలంగా వచ్చేవన్నారు. ప్రస్తుతం పెట్టుబడి విపరీతంగా పెరగడం, లాభాలు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. దీనికి తోడు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అంతంతమాత్రంగా ఉండడంతో ఆక్వా సాగుపై రైతులు ఆసక్తి తగ్గుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకురాలు దుర్గ, మహిళలు పాల్గొన్నారు.

ప్రచారంలో శివరామరాజు

సంక్షేమ పథకాలు, అభివృద్ధే గెలుపునకు సోపానాలు

వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే తన గెలుపునకు సోపానాలని ఆ పార్టీ ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాపులకు న్యాయం చేస్తానంటూ 2024 ఎన్నికల్లో సిఎం అభ్యర్థిని తానేనంటూ ప్రగల్భాలు పలికిన పవన్ కళ్యాణ్ కాపులను మోసం చేసి టిడిపితో పొత్తు పెట్టుకుని కేవలం 20 సీట్లకు సరిపెట్టుకున్నాడన్నారు. తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి 175 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టాడని, కానీ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయలేని టిడిపి జనసేన, బిజెపితో పొత్తు పెట్టుకుందన్నారు. వైసిపి ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధే తన విజయానికి సోపానాలని అన్నారు.

22న గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నరసాపురం

గురుకుల పాఠశాలల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 22వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎల్‌బి.చర్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ తెలిపారు. పెదవేగి, చింతలపూడి, ఆరుగొలను, న్యూ ఆరుగొలను గురుకుల పాఠశాలల్లో చేరేందుకు ఈ నెల 22వ తేదీ సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు జిల్లా పెదవేగి గురుకుల పాఠశాలల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

ఉప విద్యాశాఖాధికారిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా (ఎఫ్ఎసి) బాధ్యతలు స్వీకరించిన స్థానిక మండల విద్యాశాఖాధికారి-1 డి.మురళీసత్యనారాయణను స్థానిక కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తణుకు డివిజన్ నాయకులు శుక్రవారం దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రభు త్వం జారీ చేసిన జిఒ 117ని రద్దు చేసి పాఠశాల వ్యవస్థను రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణ, జె.ఉమాదేవి, జిల్లా కౌన్సిలర్లు ఎ.మాణిక్యమ్మ, చీలి రాజు, కోలా దుర్గా, బాలశంకరం, పి.కృష్ణ, టివిఎస్.భాస్కర్, సోమేశ్వరరావు, కె.వెంకటలక్ష్మి, ఎ.ప్రసన్నగీత పాల్గొన్నారు.

ఎంఇఒపై ఆరోపణలపై యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ఎంఇఒ పి.శేషుపై ఎస్‌టియుకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు చేసిన అవినీతి ఆరోపణలు యుటిఎఫ్ గణపవరం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం మండల కార్యదర్శి జి.భవానిప్రసాద్, అధ్యక్షులు జె.నాని ఓ ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యపై దృష్టి పెట్టకుండా ఎస్‌టియుకు చెందిన ఉపాధ్యాయులు వ్యక్తి దూషణలకు పాల్పడడం దారుణమన్నారు. వ్యక్తిగత కక్షలతో లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. విద్యావ్యవస్థ బలపడడానికి యూనియన్ నాయకులు కృషి చేయాలి తప్ప నిజాయితీ గల అధికారులపై ఆరోపణ చేయడం తగదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు జరిపితే మంచి దన్నారు. ఎంఇఒ పి.శేషుపై వచ్చిన ఆరోపణలకు నిరసనగా మండలంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ఖండించాయని తెలిపారు.

ఇండియా వేదికతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఇండియ వేదికతోనే అభివృద్ధి సాధ్యమని పలువురు నాయకులు అన్నారు. పట్టణంలోని అమర్ భవన్ సమావేశం మందిరంలో ఇండియా వేదిక కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి జి.రాజు, సిపిఐ నేత చలసాని రామారావు, కాంగ్రెస్ నేత మరీదు కృష్ణ మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

ఎండలపై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి అన్నారు. శుక్రవారం రోటరీ ఫౌండర్ ఫాల్హారిస్ పుట్టినరోజు సందర్భంగా నరసాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత నుంచి ఈ గొడుగులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

సీతారామపురం సౌత్‌లో నాయకర్ ప్రచారం

నరసాపురం : మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలో శుక్రవారం మన కోసం మన నాయకర్ కార్యక్రమం నిర్వహించారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ బిజెపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకల సతీష్, బండారు పటేల్ నాయుడుతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కలవకొలను తాతాజీ, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, పులపర్తి వెంకటేశ్వరరావు, కొండవీటి త్రినాథ్ పాల్గొన్నారు.

తాగునీటిని దారి మళ్లిస్తే కేసులు

ప్రజాశక్తి కథనంపై అధికారుల స్పందన

అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - ముదినేపల్లి

పంట కాలువల ద్వారా తాగునీటి చెరువులు నింపేందుకు సరఫరా చేస్తున్న తాగునీటిని అనధికారికంగా, అనుమతులు లేకుండా ఎవరైనా ఫ్యాక్టరీలకు, చేపల చెరువులకు దారి మళ్లిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఇఆర్‌డబ్ల్యుఎస్ ఎన్‌వివి సత్యనారాయణ, జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు అన్నారు. ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైన దర్జాగా నీటి చౌర్యం అనే కథనానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించారు. నీటి చౌర్యం జరిగిన ప్రాంతాన్ని మండల స్థాయి అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటిని అక్రమంగా తరలించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. నీటి చౌర్యం జరగకుండా అరికట్టేందుకు కాలువలపై గస్తీ కాయాల్సిన పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించడం కారణంగానే తాగునీరు ఫ్యాక్టరీలకు, ఆక్వా చెరువులకు మళ్లిపోతుందన్నారు. విధుల నిర్వాహణలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి దష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా మండలంలోని మంచినీటి చెరువులను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సమన్వయంతో పనిచేసి పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు గ్రామస్థాయిలో మంచినీటి చెరువులను పర్యవేక్షించి ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అదేశించారు. అనంతరం అనధికారికంగా కాలువ నుంచి మోటార్ల ద్వారా నీటిని మళ్లించిన ప్రదేశానికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా స్థాయి అధికారులు కాలువ వద్దకు పరిశీలనకు వచ్చినట్లు తెలుసుకున్న చిగురుకోటకు చెందిన గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అధికారుల వద్దకు వచ్చి పరిశ్రమకు నీటి సరఫరా నిలుపుదల చేయరాదన్నారు. పరిశ్రమ యాజమాన్యం గ్రామస్తులకు ఆర్ఒ ప్లాంట్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నందున పరిశ్రమకు కాలువ నుంచి నీటి సరఫరాను నిలుపుదల చేయొద్దంటూ అధికారులను కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ లిఖిత పూర్వకంగా సమస్యను గ్రామస్తులు తమకు ఇస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారులతో పాటు ఎంపిడిఒ ఎన్.మురళిగంగాధరరావు, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, ఇరిగేషన్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

జెసితో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ గౌరవ్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ గౌరవ్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందేనని, స్వేచ్ఛ వాతావరణంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా రాజకీయ పార్టీలు సైతం సహాయం అందించాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ బి.గౌరవ్ అన్నారు. దెందులూరు నియోజకవర్గ కార్యాలయాన్ని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ బి.గౌరవ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయక ఎన్నికల అధికారి జితేంద్ర, డిఎస్‌పి, సిఐ, సిబ్బంది ఉన్నారు.

అభ్యర్థుల ఖర్చుల నమోదు రికార్డులు పరిశీలన

ఉంగుటూరు : ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల నమోదు రికార్డులను జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు మెస్రం గౌరవ్ మధుకర్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన మేరకు గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హులవుతారన్నారు. ఎన్నికల వ్యయంపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ఫ్లెక్సీ, బ్యానర్లు, తదితర అంశాలపై వ్యయాలను లెక్కించే విధానాన్ని వివరించారు. ఎన్నికల వ్యయాన్ని లెక్కించే సమయంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ముందుగా గౌరవ్ మధుకర్‌కి ఉంగుటూరు ఆర్ఒ ఖాజావలీ పూలమొక్కని ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్, సర్వేలెన్స్ బృందాలు, ఎక్సపెండిచర్ అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

ఎంసిఎంసి అనుమతి లేకుండా

రాజకీయ ప్రకటనలు ప్రచురించొద్దు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంసిఎంసి కమిటీల ముందస్తు అనుమతి లేకుండా ప్రింట్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలను ప్రచురించకూడదని ఎలక్షన్ కమిషన్ ఉత్వర్వులు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గతంలో పలు సందర్భాల్లో ప్రింట్ మీడియాలో అభ్యంతరకరమైన, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచురితమైనట్లు ఎలక్షన్ కమిషన్ దృష్టికి వచ్చిందని తెలిపారు. వీటివల్ల ప్రభావితమయ్యే అభ్యర్థులకు, పార్టీలకు అటువంటి సందర్భాల్లో వివరణ, ఖండన అందించే సమయం కూడా ఉండనందున ఎన్నికల చివరి దశలో ఇటువంటి ప్రకటనలు మొత్తం ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ గుర్తించిందన్నారు. ఎంసిఎంసి కమిటీ వారి నుంచి ముందస్తుగా ధ్రువీకరిస్తే తప్ప పోలింగ్ రోజున, ఒక రోజు ముందు ప్రింట్ మీడియాలో ఎలాంటి ప్రకటనను ప్రచురించకూడదని తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వార్తాపత్రికలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజకీయ ప్రకటనల విషయంలో జిల్లా స్థాయిలో ఎంసిఎంసి కమిటీల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ప్రింట్ మీడియాలో ప్రకటనలు ప్రచురించి ఎలక్షన్ కమిషన్‌కు సహకరించాలని కోరారు.

టిడిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా 22న నామినేషన్

ఎంపీ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఈ నెల 22వ తేదీన టిడిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా తాను నామినేషన్ వేస్తున్నానని, ప్రజలు తనను ఆశీర్వదించాలని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జగన్ దుర్మార్గపు పాలనను తరిమికొట్టాలన్నారు. వైసిపిని వ్యతిరేకించే ప్రతిఒక్కరూ తనకు పూర్తిగా మద్దతు తెలపాలన్నారు. ఉండి నియోజకవర్గంలో కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఎంఎల్‌ఎగా పోటీ చేస్తున్నానన్నారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు టిడిపిలోనే ఉన్నారన్నారు. ఆయనతో కలిసి నడుస్తానన్నారు. నామినేషన్ వేయడానికి పెదఅమిరం నుంచి ర్యాలీగా ఉండి తహశీల్దార్ కార్యాలయానికి బయలుదేరతామన్నారు. నామినేషన్ అనంతరం ద్వారకాతిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటానని, అనంతరం ఉండి నియోజకవర్గానికి ఈశాన్యంగా ఉన్న కొండేపూడి గ్రామం నుంచి ప్రచారాన్ని నిర్వహిస్తానని తెలిపారు.

జాతీయ స్థాయిలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విజయవాడ పిబి సిద్దార్థ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) వేలం అనుకరణలో చురుకుగా పాల్గొనడం, క్రీడా జట్టు నిర్వహణ సందర్భంలో పాల్గొనేవారి ఆర్థిక రిస్క్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పరీక్షించే లక్ష్యంతో జరిగిన ఈవెంట్‌లో భాగంగా నన్నయ విద్యార్థులు ఖర్చులను కనిష్టంగా ఉంచుకుంటూ అత్యుత్తమ రేటింగ్‌తో క్రికెట్ జట్టును ఎంపిక చేయడంలో అత్యుత్తమ ప్రదర్శన చేసినందుకు ప్రతిష్టాత్మకమైన ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.అశోక్ ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ కోర్సు కో-ఆర్డినేటర్ అప్పాజీ, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

30,386.960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 2543 మంది రైతుల వద్ద నుంచి రూ.66.07 కోట్ల విలువైన 30,386.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. అయితే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమై ఇప్పటివరకు 6,403 మంది రైతులకు చెందిన 58294.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకోగా గ్రామ వ్యవసాయ సహాయకుల వారిచే షెడ్యూలింగ్ చేసే టెక్నికల్ సహాయకుని ద్వారా నమూనాలను సేకరించి తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన 68.54 లక్షల గోనె సంచులను, 200 పైగా జిపిఎస్ పరికరం రవాణా వాహనం నేటి వరకు సమకూర్చినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076, 7569597910 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తేమ శాతం 16 నుంచి 17 వరకు ఉండే విధంగా చూసుకుని ధాన్యంలో తాలు, తప్పులు మొదలైన వ్యర్థ పదార్థాలు గరిష్ఠంగా ఒక శాతం మించకుండా చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన అంశాలపై రైతులందరికీ స్పష్టంగా అవగాహన కల్పించాలన్నారు. ఆర బెట్టుకుని పురుగులు తిన్న ధాన్యం గరిష్ఠంగా ఐదు శాతం మించకూడదని, వంకర తిరిగిన ధాన్యం మూడు శాతం మించకుండా ఎ-గ్రేడ్ రకం కొనుగోలులో తక్కువ శ్రేణి ధాన్యం గింజలు గరిష్ఠంగా ఆరు శాతం వంటివి భారత ప్రభుత్వం వారిచే నిర్దేశించిన అన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుని కనీస మద్దతు ధర క్వింటాలుకు కామనం రకం రూ.2183, గ్రేడ్-ఎ రకం రూ.2203 బయోమెట్రిక్ విధానంలో తమ వేలిముద్రలు వేసి ప్రభుత్వానికి విక్రయించే విధంగా రైతులకు పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులు అవగాహన కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జెసి ఆదేశించారు.

అజయ్‌రాజును సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

ఇంటర్ విద్యార్థి అజయ్‌రాజుకు సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిపుణులైన అధ్యాపకులతో బోధన జరుగుతోందని ఏలూరు జిల్లా డివిఇఒ ఆర్.ప్రభాకరరావు అన్నారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాలపై ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి విద్యార్థి హనుమంతు అజయ్‌రాజు 985 మార్కులతో జిల్లాలో ఫస్ట్, రాష్ట్రంలో నాలుగో ర్యాంకు సాధించడం పట్ల అధ్యాపకులను అభినందించారు. కళాశాలకు పూర్తి అదనపు తరగతులు లేకపోయినా షిప్టు విధానంలో తరగతులు నిర్వహించి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి అజయ్‌రాజును డివిఇఒ దుశ్శాలువ కప్పి అభినందించారు. ఏలూరుకు చెందిన ప్రముఖ న్యాయవాది కూన కృష్ణారావు విద్యార్థికి రూ.2 వేల నగదు బహుమతిగా అందించారు.

సామాజిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన అవసరం

ప్రముఖ న్యాయవాది విద్యావేత్త ఎం.చిత్రభాను

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలే కాకుండా సామాజిక, న్యాయపరమైన అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ న్యాయవాది విద్యావేత్త, డాక్టర్ ఎం.చిత్రభాను సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ కమిటీ, సివిల్ ఇంజినీరింగ్ సంయుక్త ఆధ్వర్యంలో యాంప్లిఫైయింగ్ ఉమెన్స్ వాయిస్ ఇన్ ది పర్సూట్ ఆఫ్ జస్టిస్ అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నల్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిత్రభాను మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, ఒక్కోసారి న్యాయం జరగకపోయినా అమ్మాయిలందరూ ఎప్పుడూ జాగృతితో ఉండాలని ఆమె సూచించారు. పొక్సో, నిర్భయ చట్టాలను, దిశా యాప్‌ను మహిళలు సద్వినియోగం చేసుకుని రక్షణగా ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం కోసం ఇటువంటి సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది చిత్రభానను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణరాజు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పివిఎస్.లక్ష్మి అపర్ణ, డాక్టర్ పి.భువనేశ్వరి, డాక్టర్ శ్రీ బాల, రేవతి పాల్గొన్నారు.

చిత్రభానును సత్కరిస్తున్న మురళీకృష్ణంరాజు